రేషన్.. ఇక ముంగిట లేదండీ!



నోటితో మాట్లాడి నొసటితో వెక్కిరించినట్లుగా ఉంది చంద్రబాబు పరిస్థితి. వెరసి ఎండీయూ వాహనాల రద్దుతో ముప్పావలా కోడిపిల్ల కోసం మూడు రూపాయల పందిపిల్లను దిష్టి తీశారన్న చందంగా మారింది రేషన్‌కార్డుదారుల స్థితి. ఇంచుమించు ప్రతి పేద కుటుంబానికి సుమారు రూ.50కే అందుతున్న రేషన్ సరుకులను తెచ్చుకోవడానికి సత్యవేడు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లోని పలు గ్రామాల ప్రజలు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి తలెత్తబోతోంది. ఇంటి ముంగిట అందుతున్న ఎండీయూ వాహనాల నిలిపివేతతో కొందరైతే కిలోమీటర్ల దూరం నడిచి నెత్తిమోతన తెచ్చుకోవాల్సి పరిస్థితి నెలకొంటుండగా.. మరికొందరు చేతి చమురు వదిలించుకోవాల్సిన స్థితి వచ్చే నెల నుంచి దాపురించనుంది. దీనిపై పేదలు భగ్గుమంటున్నారు.

- వచ్చే నెల నుంచి ఎండీయూ వాహనాలు రద్దు
- రేషన్ సరుకుల కోసం షాపులకు వెళ్లాల్సిందే
- పాత పద్ధతిలోనే రేషన్ సరుకులు పంపిణీ
- ప్రభుత్వ నిర్ణయంపై ప్రజావ్యతిరేకత

వరదయ్యపాళెం/రేణిగుంట: గత ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ చేయాలనే సదుద్దేశంతో ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వాహనాలను ఏర్పాటు చేసింది. 2021 ఫిబ్రవరిలో అప్పటి జగన్ ప్రభుత్వం ఎండీయూ వాహనాలను ప్రారంభించింది. అప్పట్లో సత్యవేడు, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో అన్ని మండలాలకు ఎండీయూ వాహనాలను కేటాయించింది. పథకం ముఖ్య ఉద్దేశం నిరుద్యోగులకు జీవనోపాధి కల్పించడంతోపాటు సుదూర గ్రామాల ప్రజలకు ఇంటి వద్దకే రేషన్ సరుకులను అందజేయడమే. ఈ క్రమంలో వాహనాల ద్వారా విజయవంతంగా ఇళ్ల వద్దకు బియ్యం, ఇతర రేషన్ సరుకులను అందజేస్తున్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జులై నెల వరకు సరుకులను అందజేసి తర్వాత ఇంటింటికీ రేషన్ సరుకుల అందజేత కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ప్రజా ఉపయోగకరమైన పథకాన్ని ఎందుకు రద్దు చేయాల్సి వచ్చిందని పలువురు ప్రశ్నిస్తున్నారు. ప్రధానంగా ఒక ఊరి నుంచి మరొక ఊరికి రేషన్ సరుకుల కోసం వెళ్లాల్సిన బడుగు, బలహీన వర్గాల వారు ఇబ్బందులు పడతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ షాపుల నుంచి 2 నుంచి 3 కి.మీల దూరం ఉన్న గ్రామాలు కూడా ఉన్నాయి.

సత్యవేడు నియోజకవర్గంలో వివరాలివీ..

మండలం	రేషన్ కార్డులు	ఎండీయూ వాహనాలు	రేషన్ దుకాణాలు
సత్యవేడు	15580	10	55
బీఎన్‌కండ్రిగ	11322	08	28
నారాయణవనం	11206	07	32
వరదయ్యపాళెం	15113	09	43
పిచ్చాటూరు	10232	07	32
కేవీబీపురం	13984	09	38
నాగలాపురం	10490	06	36
మొత్తం	87927	56	264

వృద్ధులు, దివ్యాంగులకు ఇబ్బందులే

ఒంటరిగా ఉంటున్న వృద్ధులు, దివ్యాంగులకు ఎండీయూ వాహనాల రద్దుతో తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి బియ్యం మోసుకుని రావాలంటే సమస్యగా మారుతుంది. పేద వర్గాలకు చెందిన వారు ఆటోలు, ఇతర వాహనాల్లో ఛార్జీలు చెల్లించి సరుకులను ఇళ్లకు తరలించుకునే పరిస్థితి ఉండదు. ఇప్పటి వరకు ఎండీయూ వాహనం ఆయా ప్రాంతాలకు వెళ్లి సైరన్ మోగించి, మరీ అప్రమత్తం చేసి రేషన్ సరుకులను అందజేసేది. ఇకపై అలాంటి పరిస్థితి ఉండదనే సమాచారం తెలియడంతో వృద్ధులు డీలా పడిపోతున్నారు. కూటమి ప్రభుత్వం భారం తగ్గించుకునేందుకు ఎండీయూ వాహనాలను రద్దు చేస్తున్నట్లుగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సమాచారం..

మండలం	చౌక దుకాణాలు	వాహనాలు	మొత్తం కార్డుదారులు
రేణిగుంట	44	12	21,435
ఏర్పేడు	48	12	17,854
తొట్టంబేడు	32	10	13,383
శ్రీకాళహస్తి టౌన్	102	13	36,483
మొత్తం	226	47	89,155

రేషన్ వాహనం ఆపివేత సరికాదు



ఎండీయూ వాహనాలను కూటమి ప్రభుత్వం రద్దు చేయడం దుర్మార్గం. గత ఐదేళ్లుగా ఇంటి వద్దకే రేషన్ సరుకులు అందిస్తున్నారు. ఇప్పుడు ఉన్న ఫలంగా ప్రభుత్వం నిలిపి వేయాలనడం సరైన పద్ధతి కాదు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా ఉన్న పథకాలను రద్దు చేయడం చంద్రబాబుకు అలవాటే. – గురవయ్య, కళత్తూరు

నెత్తిమోత తప్పదు



నాది వరదయ్యపాళెం పంచాయతీ పరిధిలోని బీజీఆర్‌కాలనీ. టౌన్‌కు దూరంగా ఉన్న మా గిరిజనకాలనీకి గత ప్రభుత్వంలో ఐదేళ్లుగా రేషన్ వాహనం వచ్చి సరుకులు ఇచ్చేవారు. ఇప్పుడు వాహనం రద్దు చేస్తే వరదయ్యపాళెం టౌన్‌లోని రేషన్ దుకాణం–2లో సరుకులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి. 2 కిలోమీటర్లకు పైనే నెత్తిమోతతో సరుకులు తెచ్చుకోవాలి. నాలాంటి వారిని దృష్టిలో పెట్టుకుని రేషన్ బండ్ల రద్దును ఉపసంహరించుకోవాలి. – అరకయ్య, బీజీఆర్‌కాలనీ

ఇక రేషన్ సరుకులు కష్టమే



మేము రేషన్‌షాపునకు వెళ్లాలంటే 3 కిలోమీటర్ల దూరం వెళ్లాలి. మేము వెళ్లే సమయానికి డీలర్ ఉంటాడో లేదో తెలియదు. ఇకపై రేషన్ అందుకోవడం కష్టతరమే. కేవలం రాజకీయ కారణాలతోనే రేషన్ బండ్ల రద్దుకు కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పేదలకు అనుకూలంగా సరుకులు పంపిణీ చేస్తున్న వ్యవస్థపై ఇలాంటి కుట్రలు చేయడం సరికాదు. –మురళి, వెంగారెడ్డికండ్రిగ, వరదయ్యపాళెం

డీలర్ షాపుల వద్ద నిరీక్షించాలి



గత ప్రభుత్వంలో ఇంటింటికీ బియ్యం సరఫరా చేస్తుండేది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఆ పథకాన్ని రద్దు చేసింది. కూటమి ప్రభుత్వం మళ్లీ డీలర్ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తోంది. డీలర్ దుకాణం వద్ద లబ్ధి దారులు బియ్యం కోసం చేరి అక్కడ గంటలు, రోజులు తరబడి నిరీక్షించాలి. కూలీ పనులు ఆపుకుని డీలర్ షాపు వద్ద గంటలు తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి పునరావృమవుతుంది. –బత్తెయ్య, మన్ననసముద్రం, ఏర్పేడు మండలం

ఇంటి వద్దనే సరుకులు ఇవ్వండి



గతంలో మా ఇళ్ల వద్దకే రేషన్ సరుకుల బండి వచ్చేది. సరుకులు తీసుకునేందుకు ఇబ్బంది ఉండేది కాదు. ప్రస్తుతం రేషన్ వాహనాలను రద్దు చేయడంతో రేషన్ షాపుల వద్దకు వెళ్లి తెచ్చుకోవాలని ప్రభుత్వం జీఓ జారీ చేసింది. దీంతో మాకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. మేము తూకివాకం వెళ్లి సరుకులు తెచ్చుకోవాలి. చాలా ఇబ్బంది ఎదురయ్యే అవకాశం ఉంది. పాలకులు పునరాలోచించి మాకు ఇంటి వద్దకే రేషన్ సరుకులను పంపిణీ చేయాలి. – ప్రియాంక, ఎస్ఎన్ పురం, రేణిగుంట మండలం

వృద్ధులకు కష్టమే



ఇంటి ముందుకే బండి వచ్చి రేషన్ సరుకులు ఇచ్చి పోతుండడంతో నాలాంటి వృద్ధులకు ఎంతో సౌకర్యంగా ఉంది. బండిని తీసేస్తే రేషన్ షాపునకు వెళ్లి సరుకులు మోసుకొచ్చుకోవడం నాలాంటి వారికి కష్టమే. సరుకులు ఎప్పుడిస్తారో అని ఎవరినైనా అడిగి తెలుసుకోవాలి. డీలర్ ఉన్నప్పుడే వెళ్లాలి. డీలర్ లేకపోతే మళ్లీ మళ్లీ తిరగడం కష్టం. ఇంటి వద్దే సరుకులు ఇవ్వాలి. – రామమ్మ, చిన్న పొందూరు అరుంధతివాడ

3 కిలోమీటర్లు వెళ్లాలి



మా గ్రామంలో రేషన్ దుకాణం లేదు. 3 కిలోమీటర్ల దూరంలోని రాచర్ల గ్రామానికి వెళ్లి సరుకులు తెచ్చుకోవాలి. బస్సులో వెళ్లినా మెయిన్ రోడ్డులో దిగి అక్కడ నుంచి మరో కిలోమీటర్ కాలినడకన వెళ్లి సరుకులు తీసుకుని, మళ్లీ ప్రధాన రోడ్డుకు చేరుకుని అక్కడి నుంచి బస్సుకు వచ్చి ఇల్లు చేరాలి. బస్సు ఛార్జీలు చెల్లించడమే కాకుండా నాలాంటి ఒంటరి మహిళలకు ఎంతో రిస్కో. బండిని రద్దు చేస్తే ప్రతినెలా తిప్పలు తప్పవు. – లక్ష్మమ్మ, చిన్న పొందూరు అరుంధతివాడ

కష్టాలు లేకుండా సరుకులు



మాది వరదయ్యపాళెం మండలం చిన్న పాండూరు పంచాయతీలోని వీకేఆర్‌పై గిరిజనకాలనీ. 2019కి ముందు రేషన్ సరుకులు తీసుకోవాలంటే మా గ్రామం నుంచి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న చిన్న పాండూరు రేషన్‌షాపునకు వెళ్లాలి. అక్కడ డీలర్ ఎప్పుడు ఉంటాడో తెలియని పరిస్థితి. అనేకసార్లు తిరిగాల్సి వచ్చేది. అయితే జగనన్న ప్రభుత్వంలో ప్రతినెలా ఇంటి వద్దనే రేషన్ బండి ద్వారా సరుకులు సంతృప్తికరంగా అందుకున్నాం. – చెంచమ్మ, వీకేఆర్‌పై గిరిజనకాలనీ

క్లుప్తంగా

ట్రాక్టర్ కింద పడి యువకుడు మృతి

శ్రీకాళహస్తి: తొట్టంబేడు మండలం కల్లిపూడి గ్రామంలో ట్రాక్టర్ కిందపడి గుణశేఖర్ అనే యువకుడు మృతి చెందాడు. శనివారం టీడీపీ నాయకుడికి చెందిన కాంట్రాక్టు ప్రాతిపదికన ఓ కంపెనీకి గ్రావెల్ తోలుతున్న ట్రాక్టర్‌కు డ్రైవర్‌గా గుణశేఖర్ పనిచేస్తున్నాడు. అతడు మధ్యాహ్నం సమయంలో ఆదమరచి ట్రాక్టర్ కింద నిద్రపోయాడు. ఇంతలో అక్కడికి వచ్చిన బాలకృష్ణ అనే డ్రైవర్ ట్రాక్టర్ నడపడంతో దాని కింద పడుకున్న గుణశేఖర్‌పై ట్రాక్టర్ దూసుకెళ్లింది. దీంతో అతడు తీవ్రగాయాల పాలయ్యాడు. అతడిని అక్కడి నుంచి ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి కేసు నమోదు కాకుండా చేసేందుకు విఫలయత్నాలు చేశారు. అయితే ఎట్టకేలకు పోలీసులు ఆ మృతదేహాన్ని రాత్రి 10 గంటలకు పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి గ్రామోత్సవం



హరికథాగానం చేస్తున్న భాగవతారిణి

ఏర్పేడు: పాపానాయుడుపేటలోని ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామివారి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాత్రి ఆలయంలో ధ్వజారోహణం అనంతరం శనివారం ఉదయాన్నే స్వామిఅమ్మవార్ల విగ్రహాలకు పలు రకాల అభిషేకాలతో విశేష పూజలు నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తుల తోపాటు పోతురాజు ఉత్సవమూర్తిని పురవీధుల్లో ఊరేగించారు. మధ్యాహ్నం మదనపల్లెకు చెందిన భాగవతారి శివకుమారి ఆలపించిన హరికథాగానం భక్తులను అలరించింది.

12 నుంచి సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

సత్యవేడు: 2024–25 సంవత్సరానికి సంబంధించి పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక తయారీ, పరిశుభ్రతపై ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. పంచాయతీ పాలన నిర్వహణ, ఎస్‌డబ్ల్యూపీసీ, ఎస్‌హెచ్‌జీ, పారిశుద్ధ్యం, తాగునీరు, వీధిలైట్లు ఏర్పాటు, పంచాయతీరాజ్ చట్టంపై శిక్షణ ఇస్తారు.

వరదయ్యపాళెం: మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఎంపీడీఓ ప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, జీపీడీపీ స్క్రూటినీ, వీధి లైట్లు తదితర అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. కోర్సు డైరెక్టర్‌గా ఎంపీడీఓ, అసిస్టెంట్ కోర్సు డైరెక్టర్‌గా ఈఓపీఆర్డీ వ్యవహరిస్తారన్నారు. శిక్షణ వ్యయాన్ని ఆర్‌జీఎస్‌ఏ నిబంధనల మేరకు జీపీఆర్‌సీ నుంచి విడుదల చేస్తామన్నారు. మూడు రోజుల పాటు జరిగే శిక్షణకు మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు తప్పక హాజరుకావాలని కోరారు.

నైపుణ్యాలతో వ్యక్తిత్వ వికాసం



మాట్లాడుతున్న సైకాలజిస్ట్ సుధాకర్‌రెడ్డి

రేణిగుంట: విద్యతోపాటు జీవన నైపుణ్యాలను నేర్చుకుంటే వివిధ రంగాల్లో ప్రావీణ్యం పొందితే వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతుందని ప్రముఖ సైకాలజిస్ట్ ఎస్‌బీ సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కరకంబాడి రాస్ బాలాజీ బాలవికాస్ కేంద్రంలో శనివారం గ్రామీణ విద్యార్థులకు జీవన నైపుణ్యాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తెలివి, జ్ఞానం, సామర్థ్యం, సృజనాత్మకతను పెంచుకుంటే నైపుణ్యాలు అలవడుతాయన్నారు. వికాస శిక్షకుడు డాక్టర్ వి.శ్రీధర్ మాట్లాడుతూ భావ వ్యక్తీకరణలో జాగ్రత్తలు పాటించి, ఎదుటి వారికి స్పష్టతనిచ్చే కచ్చితత్వాన్ని పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాస్ ప్రాజెక్ట్ అధికారి ఎస్.రమేష్‌రెడ్డి, సమన్వయకర్త భారతి పాల్గొన్నారు.

గరుడవాహనంపై శ్రీకృష్ణుడి విహారం



ఊరేగింపులో ఆకర్షణగా డీజే మ్యూజిక్ ట్రూప్

నారాయణవనం: స్థానిక ద్రౌపదీ, ధర్మరాజుల ఆలయ మహాభారత ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం గరుడవాహనంపై శ్రీకృష్ణుడు విహరించారు. ఈ సందర్భంగా డీజే మ్యూజిక్‌కు అనుగుణంగా యువకుల డ్యాన్స్‌లతో ఊరేగింపు కొనసాగింది. ఉదయం సొరకాలస్వామి ఆలయం నుంచి అలుగు ఉత్సవం ప్రారంభమైంది. సాయంత్రం స్థానిక వర్తక సంఘం ఆధ్వర్యంలో గరుడ సేవ నిర్వహించారు.అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ భాస్కర్ నాయక్ సిబ్బందితో బందోబస్తును పర్యవేక్షించారు.

ముక్కంటి సేవలో సీసీఎల్ఏ



సీసీఎల్ఏకు జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని శనివారం రాష్ట్ర చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ జయలక్ష్మి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణగోపురం వద్ద ఈఓ ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, వేదపండితులు వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు రుద్రాభిషేకంలో పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక రాహుకేతు సర్పదోష నివారణ పూజలను చేయించుకున్నారు. స్వామి అమ్మవార్ల దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు తదితరులు పాల్గొన్నారు. ప్రోటోకాల్ అతిథి గృహం వద్ద కలెక్టర్ వెంకటేశ్వర్ వారిని మర్యాదపూర్వకంగా కలిసి వేంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేశారు.

ఘనంగా యూటీఎఫ్ స్వర్ణోత్సవం



జెండా ఎగురవేస్తున్న యూటీఎఫ్ నాయకులు

శ్రీకాళహస్తి: యూటీఎఫ్ స్వర్ణోత్సవం శనివారం పట్టణంలోని కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. జెండా ఎగురవేశారు. అనంతరం యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షుడు సూర్యప్రకాష్, రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ రాజీలేని పోరాటాలు చేసిందన్నారు. స్వర్ణోత్సవ వేడుకలను నిర్వహించకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం తొట్టంబేడు మండలం శివనాథపురం వద్ద ఉన్న అమ్మ వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు మోహన్‌బాబు, వెంకటకృష్ణ, విజయకుమార్, విజయశ్రీ, దీపిక, మునెయ్య, భక్తవత్సలం, సుబ్బరామయ్య, గోపాలకృష్ణ, సుబ్రహ్మణ్యం, శ్రీలత, సుజాత, విజయశేఖర్, చంద్రశేఖర్, మార్టిన్, చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ సంఘం నాయకులు ఘనంగా జరుపుకున్నారు. శనివారం ఎమ్మార్సీ కార్యాలయ ప్రాంగణంలో యూటీఎఫ్ జెండా ఎగురవేశారు. యూటీఎఫ్ ఆవిర్భవించి 50 వసంతాలు పూర్తి అయిన సందర్భంగా ఉపాధ్యాయుల ఇబ్బందుల పరిష్కారంలో అటు ప్రభుత్వానికి, ఇటు ఉపాధ్యాయులకు వారధిగా నిలిచినట్లు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు రాజమోహన్ బాబు, శశికుమార్, సురేష్ భగవాన్, రుషేంద్ర బాబు, వెంకటయ్య, రాజు, వెంకటమోహన్, తిరుపతి నాయుడు, శ్రీధరరావు, అనిల్ కుమార్‌లు పాల్గొన్నారు.

సామాజిక న్యాయ మహా శిల్పంపై దాడి హేయం

– సమగ్ర విచారణ చేసి బాధ్యులను శిక్షించాలి



బుచ్చినాయుడుకండ్రిగ: పల్లమాల గ్రామంలోని అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న నూకతోటి రాజేష్

బుచ్చినాయుడుకండ్రిగ: విజయవాడలో అత్యంత ప్రతిష్టాత్మకంగా గత ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్మించిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ శిల్పంపై పచ్చమూకల దాడి హేయమైన చర్య అని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజక వర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ పేర్కొన్నారు. ఈ దాడిని ఖండిస్తూ ఆయన శనివారం పల్లమాల గ్రామంలోని డాక్టరు బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ నడిబొడ్డులోని సామాజిక న్యాయ మహాశిల్పంపై గత గురువారం రాత్రి దాడి జరగడం, దాడిపై నగర పోలీసుకులకు సమాచారం ఇచ్చిన సకాలంలో స్పందించలేదని, ప్రభుత్వ ప్రోద్బలంతో దాడి జరిగిందని ఆరోపించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాలపై రాజకీయ కక్షలకు దిగడం ఇప్పటి వరకు దేశ చరిత్రంలో ఎక్కడా జరగలేదన్నారు. ఈ దాడిపై కేంద్ర ప్రభుత్వానికి చెందిన దర్యాప్తు సంస్థలతో సమగ్ర విచారణ చేయించి, బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సత్యవేడు నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ వేలూరు రాకేష్, భానుప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు రవిరెడ్డి, మణినాయుడు, గురునాథం, సాయి నాయుడు, నాయకులు గెడితోట్టి గురవయ్య, అజయ్ కుమార్‌రెడ్డి, జయచంద్రనాయుడు, కోటేశ్వరరావు, ప్రసాద్‌పాల్, కిరణ్, హేమంత్, వేంకటేష్, సంజీవి, ప్రసాద్, చంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దాడులేనా? కూటమి సామాజిక న్యాయం

నారాయణవనం: కూటమి పాలనలో రాష్ట్రంలో దాడులు, విధ్వంసాలకు పాల్పడటమే సామాజిక న్యాయంగా పచ్చ పార్టీ భావిసోందని వైఎస్సార్ సీపీ మండల నాయకులు ఆరోపించారు. విజయవాడలో అంబేద్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై దాడి చేసినందుకు నిరసనగా శనివారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, దళిత విభాగం నాయకులు అంబేడ్కర్ విగ్రహాలకు పాలాభిషేకాలను చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కేంద్రమైన నారాయణవనం బైపాస్‌లోని వైఎస్సార్ సర్కిల్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పార్టీ మండల కన్వీనర్ సొరకాయలు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సొరకాయలు, ట్రేడ్ యూనియన్ మండల అధ్యక్షుడు అయ్యప్ప, సర్పంచ్‌లు సాయిరవి, సుబ్రమణ్యంరెడ్డి, నాగూరు, ఉపసర్పంచ్ మురళి, ఎంపీటీసీ సభ్యులు రవి, పొన్నుస్వామి, శంకరయ్య, కై లాసకోన మాజీ చైర్మన్ సుబ్రమణ్యం యాదవ్, పార్టీ నాయకులు కిరణ్, గురుస్వామి, హేమచంద్రారెడ్డి, పీజీ బాబు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. దిగువ కణకంపాళ్యంలో పార్టీ దళిత నాయకుడు కిరణ్ నేతృవంలో అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి, పూలమాలతో నివాళులర్పించారు. దళిత నాయకులు మంజునాథ్, మనోహర్, గోవింద స్వామి, ముత్తు, షణ్ముగం, కొల్లాపురి, దాము, ప్రభాకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాతపై రాజకీయ కక్షా?

నాగలాపురం: విజయవాడలోని అంబేద్కర్ స్మృతి వనం వద్ద సామాజిక న్యాయ మహాశిల్పం శిలా ఫలకంపై ఉన్న అక్షరాలను టీడీపీ అల్లరి మూకలు ధ్వంసం చేయడంపై నాగలాపురం వైఎస్సార్ సీపీ నాయకులు మండిపడ్డారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఉన్న డాక్టర్ అంబేద్కర్ విగ్రహం వద్ద సర్పంచ్ చిన్నదొరై సుధా ఆధ్వర్యంలో ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి, పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అపరంజి రాజు, ప్రధానకార్యదర్శి శ్యామ్, జేసీఎస్ మండల కన్వీనర్ మోహన్ మొదలియార్, వార్డు సభ్యుడు ఉదయ్, ధనరాజ్, నాయకులు ఉదయ్ కుమార్ రెడ్డి, మదన్ మోహన్ రెడ్డి, కులశేఖర్ రెడ్డి, దేశప్పన్, రాజ, దేశన్ పాల్గొన్నారు.

స్మృతి వనంపై దాడి దళిత జాతికే అవమానం

సత్యవేడు: విజయవాడలోని బీఆర్ అంబేద్కర్ స్మృతి వనంపై దాడి యావత్ దళిత జాతికే తీరని అవమానమని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కే. చంద్రశేఖర్ రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ బి. సోమశేఖర్ అన్నారు. శనివారం అంబేద్కర్ సంఘం నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు రెవెన్యూ కార్యాలయం సమీపంలోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, ఆందోళన చేశారు. ఈకార్యక్రమంలో దళిత సంఘం నాయకులు ఎంపీ రవి, మాణిక్యం, ఈ.గోవిందస్వామి,.జోషఫ్, కమల్, పళణి, రూబెన్.హెచ్ గోవిందస్వామి, రాబర్టు, వైఎస్సార్‌సీపీ నాయకులు రమేష్, రవిరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, శ్యాంప్రసాద్ రెడ్డి, విడి. శరవన్, ఎం. సుధాకర్, మోహన్ రెడ్డి,మునివేలు,ధీనదయాల్ తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహ విధ్వంసానికి కుట్ర

వరదయ్యపాళెం: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహ విధ్వంసానికి కూటమి నేతలు కుట్ర చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్ రెడ్డి ఆరోపించారు. విజయవాడలోని అంబేడ్కర్ విగ్రహం ధ్వంసానికి నిరసనగా మండలంలోని సంతవేలూరులో అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నేతలు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విజయవాడ నడిబొడ్డున రూ.404 కోట్ల వ్యయంతో అద్భుతంగా ప్రతిష్ఠించిన బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శిబిచక్రవర్తి, వినోద్ యాదవ్, శివ యాదవ్, మణి తదితరులు పాల్గొన్నారు.



వరదయ్యపాళెం: సంతవేలూరులో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సత్యవేడు: నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ, దళిత సంఘం నాయకులు



నాగలాపురం: అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు



నారాయణవనం: డీకే పాళెంలో అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత నాయకుల నివాళి


ఏపీఐఐసీ భూములు అభివృద్ధి చేయండి



ఏపీఐఐసీ భూముల రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ యువరాజ్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరు, బీఎస్‌పురం, కొత్తపాళెం, తొట్టంబేడు మండలంలోని రౌతుసూరమాలలో ఏపీఐఐసీకి కేటాయించిన భూములను త్వరితగతిన అభివృద్ధి చేయాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషన్ యువరాజ్ అధికారులను ఆదేశించారు. ఆయన శనివారం మండలంలోని ఆలత్తూరు, బీఎస్‌పురం, కొత్తపాళెం గ్రామాల్లోని ఏపీఐఐసీ భూములు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ రూపొందిస్తుందని తెలిపారు. మండలంలో ఆలత్తూరు, బీఎస్‌పురం, కొత్తపాళెం గ్రామాలలో 2,095 ఎకరాలు ఏపీఐఐసీ భూములున్నాయన్నారు. ఈ భూములను అభివృద్ధి చేసి, పరిశ్రమలకు కేటాయించనున్నట్లు తెలిపారు. పరిశ్రమల ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకుంటే 21 రోజుల్లో భూమిని కేటాయిస్తామని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి పరిశ్రమల అభివృద్ధి కీలకమన్నారు. త్వరలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు శ్రీసిటీని సందర్శిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్రమణ్యం, డీటీ చంద్రబాబునాయుడు పాల్గొన్నారు.

నవోదయకు పిచ్చాటూరు విద్యార్థి ఎంపిక



విద్యార్థి జయచంద్ర

నాగలాపురం: పిచ్చాటూరు విద్యార్థి టీజే.జయచంద్ర మదనపల్లె జవహర్ నవోదయ పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశానికి అర్హత సాధించినట్లు ఎంఈఓ హేమమాలిని తెలిపారు. పిచ్చాటూరు చిన్నవీధికి చెందిన జగన్నాథం, రమ్య దంపతుల ద్వితీయ కుమారుడు జయచంద్ర ఈ ఏడాది జనవరిలో జవహర్ నవోదయ విద్యా సమితి నిర్వహించిన ఎంట్రన్స్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాడు. విద్యార్థి ఎంపికపై ఎంఈఓలు హేమమాలిని, యుగంధర్ రాజు, పాఠశాల కరస్పాండెంట్ గిరి, హెచ్ఎం గంగయ్య, యుగంధర్ అభినందనలు తెలిపారు.